## క్లుప్తంగా

### ఘనంగా ప్రకాశం జిల్లా ఆవిర్భావ దినోత్సవం


నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్

**కనిగిరిరూరల్:** మానవతా సంస్థ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవితం ఆదర్శనీయమన్నారు. ప్రకాశం పంతులు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మనవతా సంస్థ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాసులు, ప్రెసిడెంట్ తానిగుండాల శ్రీనివాసులరెడ్డి, వాగిచర్ల వెంకటేశ్వర్లు, పిచ్చిరెడ్డి, పసుపులేటి అరుణోధర్, ఉమాకాంత్, రమణారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, బొగ్గరపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**కనిగిరిరూరల్:** స్వాతంత్రోద్యమంలో ప్రకాశం పంతులు చేసిన పోరాటాలు, త్యాగాలు స్ఫూర్తిదాయకమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ ఆఫీసులో ఆదివారం జిల్లా అవతరణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి చైర్మన్ గఫార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పులి శ్రీనివాసులరెడ్డి, దాసరి మురళీ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### రెండు బైక్‌ల దహనం


తగులబడిన స్కూటీ

**కనిగిరిరూరల్:** పట్టణంలోని రాజీవ్ కాలనీలో ఆదివారం తెల్లవారు జామున అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు రెండు బైక్‌లను దహనం చేశారు. ట్రావెల్స్ వాహనాలను నడిపే ఎస్‌కే సుభాని ఇంటి ముందు అతని మోటార్ బైక్, భార్య స్కూటీ పార్క్ చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వాహనాలను తగులపెట్టారు. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది.

### మద్యం బాటిళ్ల పట్టివేత

**ఉలవపాడు:** అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన మండల పరిధిలోని రామాయపట్నం పల్లెపాలెం వద్ద ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన అప్పాడి సురేష్ పల్లెపాలెం వద్ద మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై అంకమ్మ తన సిబ్బందితో వెళ్లి పరిశీలించగా 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ఉలవపాడు:** ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం కావలి ఏరియా వైద్యశాలలో మృతిచెందాడు. అందిన వివరాల మేరకు.. కందుకూరుకు చెందిన మహమ్మద్ రమీజ్ (27) రాజుపాలెం నుంచి భీమవరం మీదుగా కందుకూరుకు వెళ్తున్న సమయంలో గత నెల 31న వాహనంపై నుంచి పడి గాయాలయ్యాయి. ఆ తరువాత కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 60 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యురాలు మణిదీపిక

**వలేటివారిపాలెం:** పరిసరాలు ఆరోగ్యంగా ఉంటే ఏ రోగాలు దరిచేరవని వలేటివారిపాలెం పీహెచ్‌సీ వైద్యురాలు మణిదీపిక పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బడేవారిపాలెంలో ఇంటింటికి వైద్యం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత కూడా అవసరమని చెప్పారు. పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో ఆమె 60 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. ఆమె వెంట అంగన్‌వాడీ కార్యకర్త లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# అల్లుకున్న ప్రమాదాలు !



జమ్ములపాలెంలో ప్రభుత్వ పాఠశాలకు ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


ఆలకూరపాడులో స్తంభాన్ని అల్లుకున్న పాదలు


కారుమంచిలో స్తంభం చుట్టూ ఇలా..

- ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు
- చిన్నపాటి గాలి వీస్తే కరెంట్ కట్
- ఆందోళనలో ప్రజలు, ఆక్వా రైతులు

**టంగుటూరు:** అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా ప్రమాదాలు నిత్యం చోటుచేసుకుంటున్నాయి. మన ఇంటి చుట్టూ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మనకు మరణ సంకటంగా మారాయి. చేతికందే స్థితిలో ఉండటంతో చిన్నారులు, పశువులు ప్రమాదాల బారినపడి మృత్యువాత చెందుతున్నారు. టంగుటూరు మండలంలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. కనీసం వీటి చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఒక పక్కకు ఒరిగిపోయి ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల సమీపంలో ఉన్నా అధికారులు చర్యలపై ఏమాత్రం దృష్టి సారించడం లేదు. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగితే గానీ పట్టించుకోరా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జమ్ములపాలెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల దగ్గరలో ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో విద్యార్థులకు ఎప్పుడు ఏం అవుతుందేమోనని తల్లిదండ్రులు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. కారుమంచి గ్రామ పొలాల్లో 33 కేవీ లైన్ పోతుండటంతో నిప్పురవ్వలు వస్తున్నాయి. చెట్టుకి కరెంటు షాక్ వస్తుండటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. కరెంటు స్తంభం ఉండాల్సిన స్థానంలో వేపచెట్టు ఉండటంతో అధికారులు, సిబ్బంది పట్టనట్లుగా ఉంటున్నారు.

**మరమ్మతుల పేరుతో కరెంటు కట్..**

లైన్ల మరమ్మతుల పేరుతో ఎప్పుడుపడితే అప్పుడు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఏ లైన్లకు మరమ్మతులు చేశారో ఆ శాఖ అధికారులే చెప్పాలని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. తీరప్రాంత గ్రామాల్లో రొయ్యల సాగు ఎక్కువగా ఉంటుంది. తరచూ కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. రోజుల తరబడి సరఫరా నిలిచిపోతుందని ఆక్వా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించడం లేదని వాపోతున్నారు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోయినా అధికారులు గడువులోగా బిల్లులు చెల్లించకపోతే కరెంట్ మాత్రం తొలగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కాలయాపన చేయకుండా శ్రద్ధ వహించి విద్యుత్ లైన్లను అల్లేసిన పాదలను, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**స్తంభాలను చుట్టేసిన పిచ్చిమొక్కలు..**

మండలంలో ఎక్కడ చూసినా విద్యుత్ స్తంభాలను పిచ్చిచెట్లు, తీగలు పైవరకు అల్లేశాయి. కారుమంచి, ఆలకూరపాడు, జమ్ములపాలెం, పొందూరు, కారుమంచి, తదితర గామాల్లో కరెంటు స్తంభాలకు పాదలు అల్లుకోవడంతో గాలి వీచినా, వర్షం వచ్చినా సరఫరా నిలిచిపోతుంది. దీంతో గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ప్రమాదం జరిగితే బాధ్యులెవరు ?**



నిత్యం బడి పిల్లలు తిరుగుతుండే వీధిలో ప్రభుత్వ పాఠశాలకు ఎదురుగా తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. నిప్పురవ్వలు కూడా వస్తుంటాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకొని విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లకు గార్డులు ఏర్పాటు చేయాలి.

– కొత్తపల్లి శ్రీనివాసులు, జమ్ములపాలెం

**విద్యుత్ అధికారులు స్పందించడం లేదు..**



విద్యుత్ స్తంభాలకు పాదలు అల్లేయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. రోజులో ఎప్పుడు పోతుందో, వస్తుందో తెలియడం లేదు. మరమ్మతుల పేరిట కాలయాపన చేస్తున్నారు. ఆక్వా రైతుల విద్యుత్ సమస్యలపై ఫోన్ చేస్తే స్పందించడం లేదు. విద్యుత్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

– శ్రీనివాసరాజు, అనంతవరం

# భారీ నష్టాల్లో నిమ్మ రైతులు


మండల కేంద్రంలో వ్యాపారుల వద్దకు వచ్చిన నిమ్మకాయలు


అమ్మకానికి సిద్ధంగా ఉంచిన నిమ్మకాయ

- తగ్గిన నిమ్మ ధరలు

**హనుమంతునిపాడు:** నిమ్మ కాయకు ఆది నుంచి ధర పెరిగిందే లేదు. దీంతో నిమ్మ సాగు రైతులు , కౌలు రైతులు నష్టాలతో నడుపుకొస్తున్నారు. ధరలు లేక పోయినా తోటలు దెబ్బతినకుండా వచ్చిన కాయను కోసి వ్యాపారులు అడిగిన ధరకే విక్రయించి వెళ్లాల్సి వస్తుంది. కోత కూలీలకు ఆటో బాడుగలకు వస్తే చాలని రైతులు అంటున్నారు. ప్రకాశంలో జిల్లాలో నిమ్మ సాగులో హనుమంతునిపాడు ప్రథమ స్థానంలో ఉంది. నిమ్మ సాగు అధికారుల లెక్కల ప్రకారం ముదురు, లేత తోటలు 2500 ఎకరాల్లో సాగుం చేశారు. కిలో కాయ రూ. 15 మించి ధర పలకడం లేదు. పండు కాయలు కిలో ధర రూ.10 నుంచి రూ. 15 మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. పచ్చికాయ కిలో రూ .25లు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. ఈ ఏడాది వర్షాలు కాస్త అనుకూలించడంతో నిమ్మ కాపు అనుకున్న దాని కంటే ఎక్కువ కాపు వచ్చినట్లు చెప్తున్నారు. కాయ పండి పోతుందేమోనని రైతులు కోతకోసి కనిగిరి మార్కెట్‌కు ఆటోల్లో తరలిస్తున్నారు. కొంత మంది రైతులు కూలీలు కూడా రావడం లేదని చెట్లకు వదలి వేయడంతో చెట్ల కిందనే రాలి పోతున్నాయి. పైన ధర ఉన్నా వ్యాపారులు మాత్రం కుమ్మక్కై కాయ నాణ్యతను బట్టి ధర వేస్తున్నారు. పండు కాయలు మాత్రం రూ. 10 నుంచి రూ .15 మించి ధరకు కొనుగోలు చేడం లేదు. నిమ్మకాయ వ్యాపారులు రైతులను నిలువునా దోచుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు కూడా తీరే పరిస్థితి లేదు. వ్యాపారులు మాత్రం ధర వేయడం లేదు. వ్యాపారుల అంత ఒకే మాట మీద ఉండి సిండికేట్ అయ్యి నిమ్మ రైతులను మోసం చేస్తున్నారని రైతులు శ్రీనివాసురాజు, వెంకటయ్య, వెంకయ్య ,ఇశ్రాయేలు, తిరుపతరెడ్డి, మామిరెడ్డి, గాయం వెంకటరెడ్డిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులను ఆదుకోవాల్సి కూటమి ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తూ ఆనందం వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వం నిమ్మ రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

## ప్రజాచైతన్యం కోసం ఫ్లెక్సీ ఏర్పాటు

**కనిగిరిరూరల్:** సమాజంలో జరుగుతున్న నేరాలు, ప్రమాదాలు, మోసాలపై ప్రజా చైతన్యం కోసం అవగాహన కల్పిస్తూ ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ఫ్లెక్సీ ప్రచారం నిర్వహించారు. పట్టణ ప్రధాన కూడళ్లలో హెల్మెట్లు ధరించాలని, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు వాడకం, హెల్మట్ లేక పోవడం వలన కలిగే నష్టాలు, పర్యావసనాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ భారీ ఫ్లెక్సీలను అన్ని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. ప్రజలను చైతన్యం కల్గించే విధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఐ ఎస్‌కే ఖాజావలి, హెచ్‌ఎంపాడు ఎస్సై మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


పట్టణంలో పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

## టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

**టంగుటూరు:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు ఒంగోలులోని రూడ్‌సెట్ సంస్థలో ఫిబ్రవరి 6వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ వరకు నెల రోజులు పాటు మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తారని సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ ఆదివారం ఏపీఎం కార్యాలయంలో ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు 19 ఏళ్ల నుంచి 45 సంవత్సరాలు ఉండి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. అలాగే రేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండాలి, శిక్షణ కాలంలో శిక్షణతో పాటు వసతి, భోజన సౌకర్యాలు ఉచితంగా కలిప్తారన్నారు. పేర్ల నమోదు, ఇతర వివరాల కోసం 95733 63141 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# హామీల అమలులో ప్రభుత్వాల విఫలం



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి ఖాదర్‌బాషా

**పామూరు:** విభజన హామీలను అమలుపరచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి షేక్.ఖాదర్‌బాషా అన్నారు. మండల కేంద్రం పామూరులోని సుందరయ్య భవన్ సెంటర్‌లో ఆదివారం కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ వెనుకబడిన ప్రకాశం జిల్లాకు వెయ్యి కోట్ల ప్యాకేజీని కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలని, రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో నడిపించేందుకు తోడ్పాటు అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ దిగ్గజాలకు అనుగుణంగా పనిచేస్తూ పేదలను, కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదలేసిందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం గద్దెనెక్కి ఏడు మాసాలు దాటినా నాడు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలును గాలికి వదలి ప్రజలను మభ్యపెడుతోందన్నారు. విభజన హామీలను అమలు చేయకపోతే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేసి ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్తామన్నారు. కార్యక్రమంలో షేక్ అల్లాబక్షు, యాటా వీరనారాయణ, తవ్వా శ్రీనివాసులు, కాశే శంకర్, ఎం విశాల్‌రావు, వార్డు సభ్యులు షేక్ ఇస్మాయిల్, చల్లా వెంకటేశ్వర్లు పలువురు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులకు అహంకారం తగదు


మాట్లాడుతున్న అశోక్‌బాబు

**టంగుటూరు:** ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీ ఎన్టీఆర్ బొమ్మకు ఎదురుగా ఉందని టీడీపీ నాయకులు తొలగించడం వారి అహంకారానికి నిదర్శనమని దళిత రైట్స్ ఫెడరేషన్, రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తులిబిల్లి అశోక్‌బాబు పేర్కొన్నారు. మండలం కేంద్రం టంగుటూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రాకూడదా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ బొమ్మకు అడ్డుగా ఉందని స్థానిక టీడీపీ నాయకులు పంచాయతీ కార్యదర్శి హరిబాబుతో తొలగించడం అన్యాయం అన్నారు. మాది మాల, మాదిగల మధ్య అభిప్రాయభేదాలు తప్పా శాశ్వతమైన శత్రుత్వం కాదన్నారు. ఎమ్మార్పీఎస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ మాలల మద్దతు సంపూర్ణంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాస్ పాల్గొన్నారు.

## వైభవంగా గోపూజ, మహానివేదన


గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు


అభిషేకోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

**సీఎస్‌పురం (పామూరు):** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ, అభిషేకోత్సవ కార్యక్రమం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నారాయణస్వామి వారి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తివారి ఉత్సవ మూర్తులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆదేవిధంగా గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్ నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నామానాన నూకలు తింటుంటే.. !


ప్లాస్టిక్ కవర్ చుట్టుకొని ఉన్న కోడిపుంజు


**టంగుటూరు:** పాపం.. తన మానన తన నూకలు తింటుంటే కనిపించి కనిపించనట్లుగా అలా గాలికి వచ్చి ప్లాస్టిక్ కవర్ కోడిపుంజు మెడకు చుట్టుకోవడంతో అల్లాడిపోయింది. ఈఘటన ఆదివారం మండలంలోని జమ్ములపాలెం గ్రామానికి చెందిన గుడూరి రమేష్‌బాబు ఇంటి వద్ద జరిగింది. ఎవరికి చిక్కకుండా దాదాపు రెండు గంటల పాటు ఉక్కిరిబిక్కిరై పరుగులు తీసింది. చివరకు అలసిపోయిన కోడిని యజమాని రమేశ్‌బాబు పట్టుకొని ప్లాస్టిక్ కవర్‌ను తొలగించాడు.

## వృథాగా రామతీర్థం నీరు


పైపులైను లీకవడంతో వృథాగా పోతున్న నీరు

**సింగరాయకొండ:** మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ సెంటర్‌లో రామతీర్థం పైపులైన్ వాల్ నుంచి మంచినీరు వృథాగా పోతుంది. అలాగే పెద్ద మసీదు బజారులో పైపులైను దెబ్బతిని నీరు వృథా గా పోతుందని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవటం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామతీర్థం పైపులైను వాల్ నుంచి నీరు వృథాగా పోవటంతో పాటు ఆ ప్రాంతంలో నీరు నిలబడి చిన్నపాటి కుంటను తలపిస్తుంది. రక్షిత మంచినీటి పైపు లైను కూడా దెబ్బతిని బజారులో రెండు చోట్ల నీరు వృథా పోతున్నాయని, ఈ విషయమై కొద్దినెలలుగా ఫిర్యాదు చేస్తున్నా అధికారులు దున్నపోతుపై వర్షం కురిసినట్లుగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి పైపుల లీకు కారణంగా మట్టినీరు వస్తుందని, కావున పైపుల ద్వారా వచ్చే నీరు రక్షిత నీరా లేక కలుషిత నీరా అర్థం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావునా అధికారులు స్పందించి వెంటనే పైపు లైను మరమ్మత్తులు చేసి లీకులు లేకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఉదయం మంచు.. మధ్యాహ్నం మంట


ఉదయం 8.30 గంటల ప్రాంతంలో జెండా చెట్టు సెంటర్‌లో కురుస్తున్న మంచు


పొగమంచు వలన లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్న వాహనదారులు

**కొండపి:** ఉదయాన్నే లేచి చూసేసరికి చల్లని పొగ మంచు. ఎదురుగా ఏమి కనిపించని విధంగా మంచు కురియడంతో కొండపి ప్రజలు తడిసి ముద్దయ్యారు. ఉదయం 5 గంటల నుంచి తొమ్మిదిన్నర గంటల వరకు మంచు ప్రభావం వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మంచు ప్రభావం తీవ్రంగా ఉన్నందువలన దగ్గరకు వచ్చే వరకు కూడా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంతమంది వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణాన్ని కొనసాగించారు.

**మధ్యాహ్నం మండిన ఎండ..**

ఉదయం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. రోడ్లమీద వ్యాపారం చేసుకునేవారు, వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చినవారు ఎండ ప్రభావంతో ఇబ్బందులు పడ్డారు. విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపించడంతో ఇక ఎండకాలంలో భానుడు ఎలా ఉంటాడో అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.